సాక్షి
అనంతపురం
బుధవారం । 30 । ఆగస్టు । 2023



చీనీ టన్ను రూ.20వేలు

అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డులో మంగళవారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.20 వేలు పలికాయి.



టమాట కిలో రూ.20

కక్కలపల్లి మండీలో మంగళవారం కిలో టమాట ధర గరిష్టంగా రూ.20 పలికింది. కనిష్టంగా రూ.6.50, సరాసరిన రూ.13 ప్రకారం క్రయవిక్రయాలు జరిగాయి.

గరిష్టం/కనిష్టం
38.1°/23.3°

జిల్లా అంతటా మంగళవారం పగలు, రాత్రి ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఉక్కపోత పెరిగింది. గాలివేగం కొనసాగింది. ఆకాశం పాక్షికంగా మేఘావృతమై అక్కడక్కడా తేలికపాటి వర్షం కురిసింది.

న్యూస్‌రీల్

సామూహిక గృహ ప్రవేశాలు 6కు వాయిదా



అనంతపురం టౌన్: 'నవరత్నాలు – పేదలందరికీ ఇళ్లు' పథకంలో భాగంగా జిల్లా వ్యాప్తంగా నిర్మాణాలు వేగవంతంగా జరుగుతున్నాయి. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారం చేపట్టిన ఈ నాలుగేళ్ల కాలంలో జిల్లా వ్యాప్తంగా ఇళ్లు లేని నిరుపేదలకు ఇంటి స్థలంతో పాటు 68వేల పక్కా ఇళ్లు మంజూరు చేసింది. వాటిలో ఇప్పటికే 20,337 ఇళ్ల నిర్మాణాలు పూర్తయ్యాయి. దీంతో బుధవారం లబ్ధిదారులతో సామూహిక గృహ ప్రవేశాల కార్యక్రమాన్ని చేపట్టేందుకు అధికారులు సిద్ధం చేశారు. అయితే కొన్ని అనివార్య కారణాలతో నేడు జరగాల్సిన గృహప్రవేశాల పండుగ కార్యక్రమాన్ని సెప్టెంబర్ ఆరో తేదీకి వాయిదా వేసినట్లు గృహ నిర్మాణ సంస్థ ఇన్‌చార్జ్ ప్రాజెక్టు డైరెక్టర్ నరసింహారెడ్డి తెలిపారు. ఈ విషయాన్ని లబ్ధిదారులు గమనించాలని సూచించారు.

హెచ్చెల్సీకి నీటి పునరుద్ధరణ



అనంతపురం సెంట్రల్/ బొమ్మనహాళ్: తుంగభద్ర జలాశయం నుంచి హెచ్చెల్సీకి నీటి సరఫరాను పునరుద్ధరించారు. మూడు రోజుల క్రితం కర్ణాటక పరిధిలో 78వ కిలోమీటరు వద్ద హెచ్చెల్సీకి గండి పడిన విషయం విదితమే. అధికారులు యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టారు. కాలువ గట్టు పటిష్టీకరణ పనులు పూర్తవడంతో మంగళవారం తుంగభద్ర జలాశయం నుంచి హెచ్చెల్సీకి నీటిని విడుదల చేశారు. గంటగంటకూ నీటిని పెంచుకుంటూ బుధవారం నాటికి యథావిధిగా 1,500 క్యూసెక్కుల వరకు విడుదల చేస్తారని హెచ్చెల్సీ ఎస్‌ఈ రాజశేఖర్ తెలిపారు. ప్రస్తుతం జలాశయంలో 78.504 టీఎంసీల నీటి నిల్వ ఉందని వివరించారు. వీలైనంత త్వరగా నీటిని తీసుకొచ్చి ఆయకట్టుకు విడుదల చేసేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

'ఉపాధి' కింద బావుల్లో పూడికతీత

అనంతపురం టౌన్: ఉపాధి హామీ పథకం కింద బావుల్లో పూడికతీత పనులు చేపట్టేందుకు అనుమతులు మంజూరైనట్లు జిల్లా నీటియాజమాన్య సంస్థ (డ్వామా) ప్రాజెక్టు డైరెక్టర్ (పీడీ) వేణుగోపాల్‌రెడ్డి తెలిపారు. జిల్లా వ్యాప్తంగా మూడేళ్లుగా సమృద్ధిగా వర్షాలు కురవడంతో బావుల్లో భూగర్భ జలాలు పెరిగాయన్నారు. శిథిలావస్థకు చేరుకున్న బావుల్లో సైతం నీళ్లు ఉబికి వస్తున్నాయన్నారు. దీంతో బావులను మనుగడలోకి తీసుకువచ్చి రైతులకు ఉపయోగపడే విధంగా చేసేందుకు వాటిలో పూడికతీత పనులు చేపట్టేందుకు చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. బావుల్లో పూడికతీత పనులు చేపట్టేందుకు ఆసక్తి ఉన్న రైతులు మండల పరిషత్ కార్యాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. దీనిపై ఉపాధిహామీ అధికారుల బృందం బావులను పరిశీలించి, పూడిక తీత పనులకు అనుమతులు మంజూరు చేస్తారన్నారు. మనుగడలో లేని బావులు కలిగిన రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

విధుల్లోకి తాగునీటి ప్రాజెక్టు కార్మికులు




కార్మికులతో మాట్లాడుతున్న ఎస్‌ఈ

కూడేరు: అధికారులు జరిపిన చర్చలు ఫలప్రదమవడంతో శ్రీరామరెడ్డి తాగునీటి ప్రాజెక్టు కార్మికులు సమ్మె వీడి విధుల్లోకి వచ్చారు. కూడేరు మండల పరిధిలోని పీఏబీఆర్ వద్ద ఉన్న శ్రీరామిరెడ్డి తాగునీటి ప్రాజెక్టు కింద పని చేస్తున్న కార్మికులు తమ డిమాండ్ల సాధన కోసం ఈ నెల 19న సమ్మెబాట పట్టారు. మంగళవారం ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్‌ఈ ఎహసాన్ బాషా, ఈఈ జవహర్ కుమార్, సీఐ శేఖర్, కూడేరు, ఉరవకొండ ఎస్‌ఐలు సత్యనారాయణ, వెంకటస్వామిలు ప్రాజెక్ట్ వద్దకు వెళ్లి కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు నాగరాజు, తాలుకా కార్యదర్శి రామాంజనేయులు, గంగాధర్, కొండారెడ్డి, ఎర్రిస్వామితో రెండో దఫా చర్చలు జరిపారు. వారంలోపు పెండింగ్‌లో ఉన్న రెండు నెలల వేతనాలను, నెలలోపు పెండింగ్ పీఎఫ్ సొమ్ము చెల్లించే బాధ్యత తమదేనని ఎస్‌ఈ, ఈఈ రాత పూర్వకంగా హామీ ఇచ్చారు. ఇందుకు కార్మికులు అంగీకరించి సమ్మె విరమించి విధుల్లో చేరారు.

వారికొద్దండి బాబూ..!

- టికెట్లపై 'తమ్ముళ్ల' నిరసన గళం
- జేసీ సోదరులను ప్రోత్సహించవద్దని అధిష్టానానికి ఫిర్యాదులు
- పరిటాల కుటుంబంలో ఒక్కరికి టికెటిచ్చినా ఓడిపోతాం
- జిల్లా అధ్యక్షులుగా కాదు నియోజకవర్గానికీ పనికిరారు
- నాయకుల కంటే వర్గాలే ఎక్కువని కార్యకర్తల్లో ఆందోళన
- ఎస్సీ నియోజకవర్గాల్లో కనీస గుర్తింపునివ్వడం లేదన్న విమర్శలు
- అవినీతిపరులైన కందికుంట, పల్లెకు టికెట్లు వద్దంటున్న కేడర్
- టీడీపీలో గందరగోళ పరిస్థితులు



సాక్షి ప్రతినిధి, అనంతపురం: ఎన్నికలు సమీపిస్తున్న వేళ తెలుగుదేశం పార్టీలో గందరగోళం నెలకొంది. ప్రస్తుతం నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లుగా ఉన్న నాయకులపై కార్యకర్తలు తీవ్ర అసంతృప్తిగా ఉన్నారు. వీళ్లకు టికెట్లిస్తే వచ్చే ఎన్నికల్లో మునిగిపోతాం అంటూ బహిరంగంగానే చెబుతున్నారు. నాయకుల కంటే వర్గాలు ఎక్కువయ్యాయని, ఈ నాయకుల కొట్లాటలతో పిచ్చెక్కిపోతోందని వాపోతున్నారు. మరోవైపు టీడీపీ నాయకులు ఇప్పటి వరకూ ఏం చేశామో చెప్పలేక.. భవిష్యత్‌లో ఏం చేయగలమో తెలియక ప్రజల్లోకి వెళ్లడం మానేశారు. అధికార పక్షమే ప్రతిపక్ష పార్టీ పాత్ర పోషిస్తోంది. కనీవినీ ఎరుగని రీతిలో దేశ చరిత్రలో తొలిసారి ప్రతి గడపకూ వెళుతున్న పార్టీగా వైఎస్సార్‌సీపీ రికార్డు సృష్టించింది. కుల, మత, వర్గాలకతీతంగా 86 శాతం మందికి పైగా ఉమ్మడి అనంతపురం జిల్లాలో సంక్షేమ ఫలాలు అందించిన ఘనతను సాధించింది.

వాళ్లను ప్రోత్సహిస్తే పుట్టి మునుగుతుంది

వాహనాలకు నకిలీ పత్రాలు సృష్టించి అమ్మి ఈడీ కేసులో ఇరుక్కోవడంతో పాటు తాడిపత్రిలో నిత్యం వివాదాలు సృష్టిస్తున్న జేసీ సోదరుల (దివాకర్ రెడ్డి– ప్రభాకర్‌రెడ్డి)ను ప్రోత్సహించవద్దని జిల్లా నుంచి పలువురు టీడీపీ అధిష్టానానికి ఫిర్యాదులు చేస్తూనే ఉన్నారు. వారిని ప్రోత్సహిస్తే పార్టీకి నష్టం కలుగుతుందని టీడీపీ నాయకులే చెబుతున్నారు. జేసీ సోదరుల చౌకబారు ఎత్తుగడలకు పార్టీ అథఃపాతాళానికి దిగజారిందని వాపోతున్నారు.

- పరిటాల రవి కుటుంబం పైనా అనేక ఆరోపణలు ఉన్నాయి. పరిటాల రవి హయాంలో ఆర్‌టీసీ పేరిట జరిగిన దమనకాండ చెరగని మచ్చ అని..పైగా పరిటాల సునీత నాడు మంత్రిగా ఉండి చేసిందేమీ లేదని, ఈ కుటుంబానికి రెండు టికెట్లు కాదు ఒక్కరికి టికెట్ ఇచ్చినా మునిగిపోవడం ఖాయమని పలువురు అంటున్నారు.

వీళ్లేమి జిల్లా అధ్యక్షులు బాబూ..!

జిల్లాల పునర్విభజన తర్వాత అనంతపురానికి కాలవ శ్రీనివాసులు, శ్రీసత్యసాయికి బీకే పార్థసారథి టీడీపీ జిల్లా అధ్యక్షులుగా అయ్యారు. వీళ్లపై రోజురోజుకూ వ్యతిరేకత పెరుగుతోంది. జిల్లాలో కాలువ శ్రీనివాసులు ఎవరినీ కలుపుకుపోవడం లేదని, పైగా రాయదుర్గంలో ఆయన గెలవలేని పరిస్థితి ఉందని కొంతమంది కార్యకర్తలు అంటున్నారు. ఇటీవల చంద్రబాబు అనంతపురం వచ్చినప్పుడు బాగా గుర్తింపు ఉన్న ఓ కార్యకర్తను 'చస్తే చావు' అంటూ అన్న మాటలు అక్కడున్న వారిని తీవ్ర మనస్తాపానికి గురిచేశాయి. పైగా మూడేళ్లు మంత్రిగా ఉండి ఏమీ చేయలేదని ఆరోపణలున్నాయి. దీంతో పాటు బీకే పార్థసారథి ఇంట గెలవలేక రచ్చ రచ్చ చేస్తున్నారని, ఆయనకు జిల్లా మొత్తం ఎలా అప్పగిస్తారని ప్రశ్నిస్తున్నారు. ప్రతి రోజూ బీసీ సామాజికవర్గానికి చెందిన సవితమ్మతో పోరు కొనసాగిస్తూ పెనుకొండ నియోజకవర్గానికే పరిమితమయ్యారన్న చెడ్డపేరు ఉంది. జిల్లా అధ్యక్షులుగానే కాదు నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లుగానూ వీరు పనికి రారన్న విమర్శలు గుప్పిస్తున్నారు.

అవినీతి ఆరోపణలతో ఉక్కిరిబిక్కిరి

కదిరిలో ఇప్పటికే కందికుంట వెంకట ప్రసాద్ కుటుంబానికి టీడీపీ టికెట్ ఇవ్వవద్దని మరో వర్గం పోరాడుతోంది. పుట్టపర్తిలో మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డిపై అవినీతి ఆరోపణలున్నాయని, ఆయనకు గనుక టికెట్ కేటాయిస్తే ఓటమి తథ్యమని కొందరు కుండ బద్దలుకొడుతున్నారు. గుంతకల్లులో టీడీపీకి అభ్యర్థి ఉన్నారనే విషయమే ఎవరికీ తెలియదని, కళ్యాణదుర్గంలో రెండు వర్గాలు కొట్టుకుంటూ ఉంటే పరువు బజారున పడుతోందని, అసలు అనంతపురం జిల్లావైపు అధిష్టానం ఎప్పుడైనా చూస్తోందా అంటూ కిందిస్థాయి కేడర్ మండిపడుతోంది.

దళిత నేతలకు గుర్తింపు ఏదీ?

ఉమ్మడి అనంతపురం జిల్లాలో ఉన్న రెండు ఎస్సీ నియోజకవర్గాల్లో టీడీపీ దళిత నేతలకు ప్రాధాన్యం ఇవ్వడం లేదు. రెండు నియోజవర్గాల్లోనూ ఆధిపత్య కులాల నాయకులదే పెత్తనం. శింగనమలలో బండారు శ్రావణిని పట్టించుకునే దిక్కు లేదు. స్వయానా ఆమె తండ్రిపై టీడీపీ వారే దాడి చేస్తే లోకేష్ (పాదయాత్ర సమయంలో) జిల్లాలో ఉండి కూడా పరామర్శించలేదు. ఇక మడకశిరలో టీడీపీ అభ్యర్థి ఎవరో ఇప్పటికీ తెలియదు. మైనింగ్ అవినీతిలో కూరుకుపోయిన గుండుమల తిప్పేస్వామి కనుసన్నల్లో ఆ నియోజకవర్గం ఉంది. దీంతో జిల్లాలో రోజురోజుకూ పార్టీ పరిస్థితి దిగజారిపోతోందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

ఈవీఎంలకు పటిష్ట భద్రత



ఈవీఎంలను పరిశీలిస్తున్న కలెక్టర్ గౌతమి

అనంతపురం అర్బన్: ఈవీఎంల (ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్)కు పటిష్ట భద్రత కల్పించాలని కలెక్టర్ గౌతమి అధికారులను ఆదేశించారు. నగరంలోని పాత ఆర్డీఓ కార్యాలయ సమీపంలోని గోదాములో భద్రపరిచిన ఈవీఎంలను కలెక్టర్ మంగళవారం పరిశీలించారు. ఈవీఎంల భద్రత విషయంలో తీసుకుంటున్న జాగ్రత్తల గురించి కలెక్టర్‌కు డీఆర్వో గాయత్రీదేవి వివరించారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రస్తుతం ఇక్కడున్న ఈవీఎంలను హైదరాబాద్, ఘజియాబాద్‌కు తరలిస్తామన్నారు. జిల్లాకు కొత్తగా 12,500 బ్యాలెట్ యూనిట్లు, కంట్రోల్ యూనిట్లు వస్తాయని, వాటిని గోదాములో భద్రపర్చాలన్నారు. వర్షాలు కురిస్తే గోదాములో నీరు చేరకుండా జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు. గోదాము వద్ద నిరంతం బందోబస్తు ఉండేలా చూడాలన్నారు. గోదాము లోపల, బయట సీసీ కెమెరాలు నిరంతరం పనిచేసేలా చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆర్డీఓ మధుసూదన్, తహసీల్దార్ శ్రీధర్ మూర్తి, ఎన్నికల విభాగం డీటీ కనకరాజు, ఎస్‌ఏ శామ్యూల్ బెంజిమెన్, సిబ్బంది శివ, శ్రీనాథ్, రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

బీఫార్మసీ ఫలితాలు విడుదల

అనంతపురం: బీ.ఫార్మసీ మూడో సంవత్సరం రెండో సెమిస్టర్ (ఆర్–19) రెగ్యులర్, సప్లిమెంటరీ ఫలితాలు, బీఫార్మసీ మూడో సంవత్సరం ఒకటో సెమిస్టర్ (ఆర్–19) సప్లిమెంటరీ పరీక్ష ఫలితాలను విడుదల చేసినట్లు జేఎన్‌టీయూ అనంతపురం డైరెక్టర్ ఆఫ్ ఎవాల్యుయేషన్స్ ఇ.కేశవరెడ్డి, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ బి.చంద్రమోహన్‌రెడ్డి తెలిపారు. పరీక్ష ఫలితాల కోసం జేఎన్‌టీయూ వెబ్‌సైట్‌ను సంప్రదించాలన్నారు.

తెలుగు భాష అజరామరం

అనంతపురం కల్చరల్: తెలుగు భాష అజంతం.. అజరామరం అని భాషాభిమానులు అన్నారు. వ్యవహారిక భాషోద్యమ పితామహుడు గిడుగు రామ్మూర్తి జయంతిని పురస్కరించుకుని మంగళవారం జిల్లా వ్యాప్తంగా తెలుగు భాషా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. అనంతపురంలోని జిల్లాపరిషత్ సమీపంలోని తెలుగుతల్లి కూడలికి వివిధ పాఠశాలల విద్యార్థులు, భాషాభిమానులు ర్యాలీగా వెళ్లారు. అక్కడ తెలుగుతల్లి విగ్రహానికి పూలమాల వేసి 'మా తెలుగు తల్లికి మల్లె పూ దండ' గీతాన్ని ఆలపించారు. ఈ సందర్భంగా తెలుగు పరిరక్షణ వేదిక అధ్యక్షుడు బి.నారాయణ, డాక్టర్ ఉమర్ ఆలీషా సాహితీ సమితి అధ్యక్షుడు రియాజుద్దీన్, కవులు, రచయితలు నానీల నాగేంద్ర, డాక్టర్ నగరూరు రసూల్, పూజారి ఈరన్న తదితరులు తెలుగుభాష ఔన్నత్యాన్ని కొనియాడారు. మాతృభాషపై ప్రేమ కలిగేలా తల్లిదండ్రులు చిన్నారులను ప్రోత్సహించాలని సూచించారు. పలు సంస్థల ప్రతినిధులు, ఉపాధ్యాయులు తెలుగుతల్లికి నీరాజనాలర్పించారు.





తెలుగుతల్లి విగ్రహానికి నీరాజనాలర్పిస్తున్న విద్యార్థులు, పుట్లూరులో తెలుగుతల్లి వేషధారణలో చిన్నారి

భాషోద్యమ మూలపురుడు గిడుగు రామ్మూర్తి

అనంతపురం అర్బన్: వ్యవహారిక భాషోద్యమానికి మూలపురుషుడు గిడుగు రామ్మూర్తి అని కలెక్టర్ గౌతమి కొనియాడారు. మంగళవారం కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాలులో గిడుగు రామ్మూర్తి జయంతి నిర్వహించారు. కలెక్టర్ పాల్గొని గిడుగు చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ గిడుగు రామ్మూర్తి తెలుగు వాడుక భాష ఉద్యమానికి పితామహుడన్నారు. గ్రాంథిక భాషలో ఉన్న తెలుగు వచనాన్ని ప్రజల వాడుక భాషలోకి తీసుకొచ్చి భాషలో ఉన్న విలువను తెలియజెప్పిన మహనీయుడన్నారు. వ్యవహారిక భాషను గ్రంథరచనకు స్వీకరించేందుకు చిత్తశుద్ధితో కృషి చేశారన్నారు. ప్రతి ఒక్కరూ గిడుగు బాటలో నడిచి తెలుగు భాషా అభ్యున్నతికి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ కుషాల్‌జైన్, పర్యాటక శాఖ అధికారి నాగేశ్వరెడ్డి, కలెక్టరేట్ పరిపాలనాధికారి శ్రీధర్, సూపరింటెండెంట్ పుణ్యవతి పాల్గొన్నారు.



గిడుగు చిత్రపటానికి కలెక్టర్ గౌతమి నివాళి

పదిలో వంద శాతం ఉత్తీర్ణతే లక్ష్యం

- సాంఘిక సంక్షేమశాఖ జేడీ మధుసూదన్‌రావు

అనంతపురం రూరల్: పదో తరగతి పరీక్షల్లో వంద శాతం ఉత్తీర్ణత సాధించే విధంగా విద్యార్థులను తీర్చిదిద్దాల్సిన బాధ్యత వార్డెన్లపై ఉందని సాంఘిక సంక్షేమశాఖ జాయింట్ డైరెక్టర్ (జేడీ) మధుసూదన్‌రావు ఆదేశించారు. మంగళవారం నగరంలోని బీసీ స్టడీ సర్కిల్ కార్యాలయంలో సాంఘిక సంక్షేమ వసతి గృహాల వార్డెన్లు, సహాయ సంక్షేమ అధికారులతో సమావేశం నిర్వహించారు. జేడీ మాట్లాడుతూ పదో తరగతిలో వంద శాతం ఉత్తీర్ణత సాధించాలంటే ఇప్పటి నుంచే వార్డెన్లు అన్ని జాగ్రత్తలూ తీసుకోవాలన్నారు. వసతి గృహాల్లో ట్యూటర్లను ఏర్పాటు చేయడంతో పాటు పరీక్షలపై విద్యార్థులకు అవగాహన కల్పించాలన్నారు. పాఠశాలల సెలవు దినాల్లో విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించాలన్నారు. గతంలో మాదిరి ఏదో పరీక్షల సమయంలో ట్యూటర్లతో పాఠాలు చెప్పిద్దామంటే కుదరదన్నారు. ప్రతి హాస్టల్‌లోనూ వంద శాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా పెట్టుకోవాలన్నారు. విద్యార్థులకు రుచికరమైన భోజనం అందించడంతో పాటు అన్ని మౌలిక సదుపాయాలు కల్పించడానికి ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుందన్నారు. ప్రభుత్వ ఆశయానికి అనుగుణంగా వార్డెన్లు మెనూ అమలు చేయడంతో పాటు వసతి గృహాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో అనంతపురం సహాయ సంక్షేమ అధికారి దామోదర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జేడీ మధుసూదన్‌రావు

జిల్లాకు వర్ష సూచన

బుక్కరాయసముద్రం: రానున్న ఐదు రోజుల్లో ఉమ్మడి అనంతపురం జిల్లాకు వర్ష సూచన ఉందని రేకులకుంటలోని ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ పరిశోధన స్థానం అధిపతి, ప్రధాన శాస్త్రవేత్త సహదేవ రెడ్డి, సీనియర్ శాస్త్రవేత్త అశోక్‌కుమార్ తెలిపారు. ఈ మేరకు వారు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. తేలికపాటి నుంచి మధ్యస్థ వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉన్నట్లు తెలిపారు. పగటి ఉష్ణోగ్రతలు 37.0–37.4, రాత్రి ఉష్ణోగ్రతలు 25.2–25.6 డిగ్రీల సెల్సియస్ నమోదు కావొచ్చని పేర్కొన్నారు. గాలిలో తేమ శాతం ఉదయం 66–69, మధ్యాహ్నం 37–44గా నమోదయ్యే అవకాశం ఉందని తెలిపారు.

పకడ్బందీగా ప్రజా పంపిణీ వ్యవస్థ









మాట్లాడుతున్న జేసీ కేతన్‌గార్గ్, జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ, డీఎస్‌ఓ శోభారాణి, ఎమ్మెల్యే అనంత, ఎమ్మెల్సీ మంగమ్మ

- జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్

అనంతపురం అర్బన్: జిల్లాలో ప్రజా పంపిణీ వ్యవస్థ పకడ్బందీగా నిర్వహిస్తున్నామని జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్ అన్నారు. మంగళవారం కలెక్టరేట్ రెవెన్యూ భవన్‌లో జేసీ అధ్యక్షతన ఆహార సలహా సంఘం సమావేశం నిర్వహించారు. జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ ప్రజాపంపిణీలో అవకతవకలకు తావివ్వకూడదన్నారు. కార్డుదారులకు బియ్యం, నిత్యావసర సరుకులు సక్రమంగా పంపిణీ చేయాలన్నారు. ఎండీయూ వాహనాలు ఇంటింటికీ వెళ్లి రేషన్ అందజేయాలన్నారు. వాహనాలకు జీపీఎస్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఆహార భద్రత ప్రధాన అంశమన్నారు. చికెన్, మటన్ దుకాణాలను, రెస్టారెంట్లను డిప్యూటీ తహసీల్దారులు, పౌర సరఫరాల అధికారులు, ఫుడ్ సేఫ్టీ అధికారులు తరచూ తనిఖీలు నిర్వహించాలని ఆదేశించారు. చౌక బియ్యం ఎక్కడైనా రీ సైక్లింగ్ చేస్తుంటే సమాచారం ఇవ్వాలన్నారు. ఆహార సలహా సంఘం సభ్యులు అందించే సూచనలు, సలహాలను పాటిస్తామన్నారు. సమావేశంలో జిల్లా సరఫరాల అధికారి (డీఎస్‌ఓ) శోభారాణి, సలహా సంఘం సభ్యులు, వినియోగదారుల సంఘం ప్రతినిధులు, ఎండీయూ వాహనదారుల సంక్షేమ సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

రేషన్ పంపిణీపై దృష్టి

అన్ని వర్గాల ప్రజల సంక్షేమం లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ అన్నారు. కార్డుదారులకు ప్రభుత్వం బియ్యం, జొన్నలు, రాగులు ఉచితంగా అందిస్తోందన్నారు. కందిపప్పు, గోధుమ పిండి తక్కువ ధరకు ఇస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వం అందించే బియ్యం, నిత్యావసర సరుకులు ఇంటింటికీ సక్రమంగా పంపిణీ జరిగేలా దృష్టి సారించాలన్నారు.

సమర్థవంతంగా అమలు చేయాలి

ప్రజాపంపిణీ వ్యవస్థను అధికారులు సమర్థవంతగా అమలు చేయాలని అనంతపురం ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి సూచించారు. కార్డుదారులందరికీ బియ్యం, నిత్యావసర సరుకులు సక్రమంగా అందుతున్నాయా అనేది ఆహార సలహా సంఘం పరిశీలించాలన్నారు. ఎండీయూ వాహనాలు ఇంటింటికి రేషన్ పంపిణీ సక్రమంగా చేస్తున్నాయా అనేది సమీక్షించాలన్నారు. అంగన్వాడీ కేంద్రాల్లో గర్భిణులకు అందించే భోజనం పరిశీంచాలని, నగర శివారల్లోని హోటళ్లలో విజిలెన్స్ తనిఖీలు నిర్వహించాలని సూచించారు.

బియ్యం పక్కదారి పట్టరాదు

ప్రభుత్వం పేదల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని పౌష్టికమైన ఫోర్టిఫైడ్ బియ్యాన్ని ఉచితంగా ఇస్తోందని ఎమ్మెల్సీ మంగమ్మ అన్నారు. ఈ బియ్యం పక్కదారి పట్టకుండా చూడాలన్నారు. చౌక బియ్యం అక్రమ రవాణాపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు.

నేటి నుంచి న్యాయవాదుల విధుల బహిష్కరణ

అనంతపురం: అనంతపురం, శ్రీ సత్యసాయి జిల్లాల్లోని అన్ని కోర్టుల్లోనూ బుధవారం నుంచి మూడు రోజుల పాటు న్యాయవాదులు విధులు బహిష్కరిస్తున్నట్లు అనంతపురం బార్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు విశ్వనాథరెడ్డి తెలిపారు. ఈ మేరకు ఆయన మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఎస్సీ, ఎస్టీ కోర్టు స్పెషల్ సెషన్స్ జడ్జి తరచూ విధులకు గైర్హాజరవుతున్నారని, న్యాయవాదులతో వ్యవహరించే తీరు సరిగా లేదని, వెంటనే జడ్జిని బదిలీ చేయాలనే ప్రధానమైన డిమాండ్‌తో విధుల బహిష్కరణకు పిలుపునిచ్చినట్లు తెలిపారు. జిల్లా కోర్టులో బార్ అసోసియేషన్ జనరల్ బాడీ సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నామని పేర్కొన్నారు. ఎస్సీ, ఎస్టీ కోర్టు స్పెషల్ జడ్జిని బదిలీ చేయాలని పోర్ట్‌ఫోలియో జడ్జికి వినతి పత్రం అందజేశామన్నారు.

అత్యాచార కేసులో ముద్దాయికి జీవిత ఖైదు

అనంతపురం : కూతురిపై అత్యాచారం చేసి సభ్య సమాజం తలదించుకునేలా ప్రవర్తించిన తండ్రికి జీవిత ఖైదు శిక్ష పడింది. ఈ మేరకు అనంతపురం పోక్సో కోర్టు జడ్జి రాజ్యలక్ష్మి మంగళవారం సంచలన తీర్పు వెలువరించారు. కేసు పూర్వాపరాల్లోకెళ్తే... కదిరి పట్టణానికి చెందిన తలుపుల బాబ్జాన్ మద్యానికి బానిసయ్యాడు. మద్యం మత్తులో ఉన్నపుడు విచక్షణ కోల్పోయేవాడు. తన భార్య ఇంటిలో లేని సమయంలో 14 ఏళ్ల కుమార్తెను బెదిరించి లైంగిక దాడి చేశాడు. చివరకు ఆరోగ్యం క్షీణించిన బాలిక పాఠశాలకు వెళ్లినపుడు కళ్లు తిరిగి పడిపోయింది. ఉపాధ్యాయులు డాక్టర్‌తో చూపించగా.. బాలిక గర్భవతి అని నిర్ధారించారు. దీనికి కారణమైన తండ్రిపై సదరు బాలిక 2018 నవంబర్ 26న పట్టణ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. 376 (ఎఫ్), 342, 506, ఐపీసీ, సెక్షన్ 5(జే), (2) (ఎన్), 6 ఆఫ్ పోక్సో యాక్ట్ కింద నిందితుడిపై కేసు నమోదు చేశారు. అప్పటి డీఎస్పీ శ్రీలక్ష్మి కేసు దర్యాప్తు పూర్తి చేసి, చార్జ్‌షీట్ దాఖలు చేశారు. కోర్టులో ప్రత్యేక ప్రాసిక్యూటర్ కసనూరు విద్యాపతి బాధితురాలి పక్షాన 13 మంది సాక్షులను విచారణ చేశారు. కేసు పూర్వాపరాలు, వాదనల అనంతరం ముద్దాయి తలుపుల బాబ్జాన్‌పై నేరం రుజువైంది. ముద్దాయికి జీవిత కాలం జైలు శిక్ష, సెక్షన్ 506 ఐపీసీ కింద రెండేళ్ల కఠిన కారాగార శిక్ష, రూ.5 వేల జరిమానా విధిస్తూ పోక్సో కోర్టు జడ్జి రాజ్యలక్ష్మి మంగళవారం తీర్పు చెప్పారు. బాధితురాలికి రూ.4 లక్షలు పరిహారంగా అందించాలని ప్రభుత్వానికి సిఫార్సు చేశారు.





అనంతపురంలో ఓ ఇంటిలో ఓనం వేడుకలు జరుపుకొంటున్న మలయాళీలు

కనుల పండువగా ఓనం వేడుకలు

అనంతపురం కల్చరల్: నగరంలో ఓనం వేడుకలు కనుల పండువగా జరిగాయి. మలయాళీల ఇంట సందడి కనిపించింది. అలాగే పాతూరు చెరువుకట్ట అయ్యప్ప స్వామి ఆలయంలో ఉదయం 5 గంటలకే ప్రత్యేక పూజలు, దర్శన సేవలు ప్రారంభమయ్యాయి. దేవస్థానం కమిటీ అధ్యక్షుడు మణికంఠ గౌతం ఆధ్వర్యంలో స్వామివారికి శ్రీగంధంతో అలంకార సేవలు, స్వామివారి దివ్యదర్శనం, అఖండ దీపారాధన, అప్పం పూజలు కేరళ సంప్రదాయరీతిలో జరిగాయి. కార్యక్రమంలో ఆలయ కమిటీ సెక్రటరీ నాగలింగారెడ్డి, ఉపాధ్యక్షులు మోహన్, నాగానందం, కేశవ, కల్లూరు రాము, శంకర తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

వ్యక్తిపై ఎలుగుబంటి దాడి



గాయపడ్డ యల్లప్ప

కళ్యాణదుర్గం రూరల్: మండలంలోని కుర్లపల్లిలో రైతు యల్లప్పపై ఎలుగుబంటి దాడి చేసింది. మంగళవారం ఉదయం పొలం పనులకు వెళుతున్న సమయంలో పొదల మాటు నుంచి ఒక్కసారిగా ఎలుగు బంటి దాడి చేయడంతో గమనించిన చుట్టుపక్కల రైతులు గట్టిగా కేకలు వేస్తూ అదిలించారు. అప్పటికే ఎలుగు బంటి యల్లప్ప పొట్టపై బలంగా రక్కడంతో తీవ్ర రక్తగాయాలయ్యాయి. క్షతగాత్రుడిని 108 అంబులెన్స్ ద్వారా కళ్యాణదుర్గంలోని సీహెచ్‌సీకి తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం వైద్యుల సూచన మేరకు అనంతపురంలోని సర్వజనాస్పత్రికి కుటుంబసభ్యులు తీసుకెళ్లారు.

108లో ప్రసవం




నవజాత శిశువును అందజేస్తున్న ఈఎంటీ

రాయదుర్గంటౌన్: పురిటి నొప్పులతో బాధపడుతున్న ఓ గర్భిణి 108 అంబులెన్స్‌లోనే ప్రసవించింది. వివరాలు.. రాయదుర్గం మండలం ఆవులదట్ల గ్రామానికి చెందిన నిండు గర్భిణి జ్యోతి (మూగ)కి సోమవారం అర్ధరాత్రి పురిటి నొప్పులు మొదలయ్యాయి. దీంతో కుటుంబసభ్యుల నుంచి సమాచారం అందుకున్న 108 సిబ్బంది సకాలంలో ఆ గ్రామానికి చేరుకుని రాయదుర్గంలోని సీహెచ్‌సీకి తరలించారు. రెండో కాన్పు కష్టతరంగా ఉందని గమనించిన వైద్యులు వెంటనే రెఫర్ చేయడంతో ఆమెను పిలుచుకుని కళ్యాణదుర్గంలోని ఆర్డీటీ ఆస్పత్రికి 108 సిబ్బంది బయలుదేరింది. మార్గ మధ్యంలో నొప్పులు ఎక్కువ కావడంతో వాహనాన్ని రోడ్డు పక్కన ఆపి పైలెట్ మహేష్ సాయంతో ఈఎంటీ రామతులసి కాన్పు చేశారు. పండంటి మగబిడ్డకు జ్యోతి జన్మనిచ్చింది. అనంతరం తల్లీబిడ్డను ఆర్డీటీ ఆస్పత్రికి చేర్చారు. ఈ సందర్భంగా 108 సిబ్బందికి జ్యోతి భర్త రమేష్, కుటుంబసభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

బతుకు పూల బాట

- పూల తోటల సాగుపై రైతుల ఆసక్తి
- ఉమ్మడి జిల్లాలో విస్తరిస్తున్న తోటలు
- కనకాంబరాలు మొదలుకొని గులాబీల దాకా పండిస్తున్న వైనం



మడకశిర ప్రాంతంలో సాగు చేసిన ముద్దబంతి పూల తోటలు



ఈయన పేరు నరసింహ మూర్తి. మడకశిర మండలం కదిరేపల్లి గ్రామం. తనకున్న నాలుగు ఎకరాల్లో ఎనిమిదేళ్ల నుంచి బోరు బావి కింద ముద్ద బంతి పూలు సాగు చేస్తున్నారు. ఎకరాకు రూ. 25 వేల నుంచి రూ. 30 వేల పెట్టుబడి పెట్టారు. కోసిన పూలను హైదరాబాద్, రాజమండ్రి, తుమకూరు మార్కెట్‌కు తరలించి విక్రయిస్తున్నారు. మార్కెట్‌లో కేజీ పూలు రూ.10 ఉంటే ఎకరాకు ఖర్చులు పోనూ రూ. 50 వేలకు పైగా ఆదాయం వస్తోంది. అదే రూ.20 నుంచి రూ. 30 ఉంటే రూ.లక్ష పైగా అందుతోంది.



చిత్రంలో కనిపిస్తున్న వ్యక్తి పేరు శ్రీనివాస్. రొళ్ల మండలం. దాసప్ప పాళ్యం గ్రామం. బోరు బావి కింద ఎకరాలో చామంతి పూలు, మరో ఎకరా వక్క తోటలో అంతర పంటగా గులాబీ పూలు సాగు చేశాడు. చామంతి పూల సాగుకు రూ. లక్ష వరకు ఖర్చయింది. గులాబీ సాగుకు రూ.50 వేలు వచ్చింది. ప్రస్తుతం మార్కెట్‌లో ధరలు బాగా ఉండడంతో చామంతి పూల విక్రయం ద్వారా రూ. రెండు లక్షల నుంచి రెండున్నర లక్షల వరకూ అందింది. గులాబీల ద్వారా రూ.లక్ష నుంచి ఒకటిన్నర లక్ష వరకు పొందారు.

సాక్షి, అనంతపురం డెస్క్: పెళ్లిళ్లు, ఊరేగింపులు, ఉత్సవాలు, సన్మానాలు , సత్కారాలు, స్వాగతాలు ..ఇలా ఏ కార్యక్రమమైనా పూలతో పని ఉంటుంది. అది శుభకార్యమైనా, అశుభకార్యమైనా పూలు తప్పనిసరిగా ఉండాల్సిందే. అందుకే పూలు పండించే రైతులు, పూలమ్ముకునే వ్యాపారులు నష్టపోవడం చాలా అరుదు. ఈ సత్యం తెలిసిన పలువురు రైతులు తమ బతుకులకు 'పూలబాట' వేసుకుంటున్నారు. సంప్రదాయ పంటల సాగును తగ్గించుకుని పూల తోటలపై మొగ్గు చూపుతున్నారు.

విభిన్న రకాల సాగు

ఉమ్మడి అనంతపురం జిల్లాలో ఒకప్పుడు కనకాంబరాలు, మల్లె, బంతిపూలు వంటి మూడు నాలుగు రకాల పూల తోటలు మాత్రమే సాగయ్యేవి. కానీ ఇప్పుడు విభిన్న రకాలు సాగు చేస్తున్నారు. ప్రజల అభిరుచి, మార్కెట్లో డిమాండ్ను బట్టి అరుదైన రకాలు సైతం పండిస్తున్నారు. చామంతి, కనకాంబరం, మల్లె, బంతిపూలతో పాటు ఆస్టర్, కాగడా, లిల్లీ, గులాబీ, చాందిని, సంపంగి, విర జాజి వంటి పూల తోటలు సాగు చేస్తున్నారు.



1,600 హెక్టార్లకు పైగా తోటలు

ఉమ్మడి జిల్లాలో 1,600 హెక్టార్లకు పైగా పూల తోటలు విస్తరించి ఉన్నాయి. శ్రీ సత్యసాయి జిల్లాలో సుమారు 800 హెక్టార్లు, అనంతపురం జిల్లాలో 800 హెక్టార్లలో పూల తోటలు ఉన్నట్లు ఉద్యాన శాఖ అధికారులు చెబుతున్నారు. ఇందులో 50 శాతానికి పైగా బంతిపూలనే సాగు చేస్తున్నారు. కొందరు రైతులు ప్రధాన పంటగా పూల సాగు చేపడుతుండగా .. మరి కొందరు అంతర పంటగా ఎంచుకుంటున్నారు. బొప్పాయి వంటి పండ్ల తోటల్లో కనకాంబరాలను అంతర పంటగా సాగు చేయడం జిల్లాలో ఎప్పటినుంచో ఉంది. అనంతపురం జిల్లాలోని నార్పల, శింగనమల, బుక్కరాయసముద్రం, గార్లదిన్నె, పామిడి, కుందుర్పి, కణేకల్లు, గుంతకల్లు, శ్రీ సత్యసాయి జిల్లాలోని మడకశిర, అగళి, రొళ్ల, అమరాపురం, గుడిబండ, తనకల్లు, నల్లచెరువు, చిలమత్తూరు, లేపాక్షి, హిందూపురం మండలాల్లో పూల తోటల విస్తీర్ణం ఎక్కువగా ఉంది. అగళి మండలం నరసంబూది, మడకశిర మండలం బేగర్లపల్లి వంటి గ్రామాల్లో 80 శాతానికి పైగా రైతులు పూల తోటల సాగు పైనే ఆధారపడ్డారు.

అండగా స్థానిక మార్కెట్లు

ఉమ్మడి జిల్లాలోని కదిరి, బత్తలపల్లి, మడకశిర, సరిహద్దున కర్ణాటకలో ఉన్న శిర, తుమకూరు తదితర ప్రాంతాల్లోని పూల మార్కెట్లు రైతులకు దశాబ్దాలుగా అండగా నిలుస్తున్నాయి. రైతులు ఆయా ప్రాంతాల్లోని వ్యాపారులకు పూలు విక్రయిస్తున్నారు. సీజన్ బట్టి ధరలు కూడా బాగుంటుండడంతో రైతులు స్థానిక మార్కెట్లనే నమ్ముకుంటున్నారు. రైతుల నుంచి పూలు కొంటున్న వ్యాపారులు వాటిని చెన్నై, బెంగళూరు, హైదరాబాద్ వంటి నగరాలకు ఎగుమతి చేస్తున్నారు. స్థానిక అవసరాలకూ విక్రయిస్తున్నారు.

వక్క తోటలో అంతర పంటగా సాగు చేసిన గులాబీ మొక్కలు

ఏడాది పొడవునా దిగుబడి



రెండెకరాల పొలంలో రెండేళ్ల క్రితం సుమారు 50 వేలు పెట్టుబడి పెట్టి లిల్లీ పూలు సాగు చేశా. రెండేళ్లుగా దిగుబడి వస్తోంది. పంట బాగుంటే ఎకరంలోనే 60–70 కిలోల పూలు లభిస్తున్నాయి. కర్ణాటక రాష్ట్రం బళ్లారి మార్కెట్‌కు వాటిని తరలిస్తున్నా. ఏడాది పొడవునా దిగుబడి వస్తుంది.

– వెంకట నారాయణరెడ్డి, బోరంపల్లి గ్రామం, కళ్యాణదుర్గం మండలం

మంచి లాభాలు



"నాలుగు నెలల క్రితం ఒకటిన్నర ఎకరం పొలంలో రూ.30 వేలు పెట్టుబడి పెట్టి లిల్లీపూలు సాదుచేశా. ఇప్పుడిప్పుడే మొగ్గలు వేస్తున్నాయి. పూలను కర్ణాటక రాష్ట్రం పావగడ మార్కెట్‌కు పంపిస్తా. పంట మూడేళ్లు ఉంటుంది. లిల్లీ పూల సాగులో పెట్టుబడి తక్కువ. దిగుబడి ఎక్కువ. దీంతో మంచి లాభాలు వస్తాయి.

– మారుతి, రైతు, అచ్చంపల్లి, కంబదూరు మండలం

లాభదాయక పంట చామంతి



దాదాపు 10 ఏళ్ల నుంచి చామంతి సాగు చేస్తున్నా. మదనపల్లె సమీపంలోని వాయల్పాడు, లేదంటే, తమిళనాడులోని రాయకోటి వద్ద ఒక్కొక్కటి రూపాయి చొప్పున దాదాపు 8 నుంచి నుంచి 10 వేల మొక్కలు తీసుకొచ్చి నాటుతున్నా. ఎకరానికి రూ.50 వేల మేర ఖర్చవుతుంది. నాలుగు నెలలకు పూలు కోతకు వస్తాయి. దాదాపు 5 టన్నుల దిగుబడి వస్తుంది. ప్రస్తుతం పూలు మార్కెట్‌లో కేజీ రూ. 150 పలుకుతున్నాయి. ఈ లెక్కన బాగానే గిట్టుబాటవుతోంది.

– తలారి ప్రసాద్, చామంతి రైతు, నార్పల

పూల సాగుకు నేలలు అనుకూలం



పూల సాగుతో రైతులకు లాభాలు ఉన్నాయి. ప్రభుత్వం ఒక సీజన్‌కు హెక్టారులో సాగు చేసిన పూల తోటలకు రూ.16 వేల ప్రకారం సబ్సిడీ అందజేస్తోంది. దీంతో పాటు సబ్సిడీపై డ్రిప్ పరికరాలు అందజేస్తున్నారు. మార్కెటింగ్‌కు జిల్లా అనుకూలంగా ఉంది. బెంగళూరు మార్కెట్‌కు తరలించి లాభాలు ఆర్జించవచ్చు. జిల్లాలోని అన్ని ప్రాంతాలు పూల సాగుకు అనుకూలమైనవి.

– చంద్రశేఖర్, ఉద్యానశాఖ అధికారి, శ్రీసత్యసాయి జిల్లా

క్రీడలకూ ప్రాధాన్యతనివ్వండి

- కలెక్టర్ ఎం. గౌతమి



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న కలెక్టర్ గౌతమి

అనంతపురం: చదువుతో పాటు క్రీడలకూ తగిన ప్రాధాన్యతనిచ్చినప్పుడే అన్ని రంగాల్లో రాణించగలుతారని విద్యార్థులకు కలెక్టర్ గౌతమి సూచించారు. మేజర్ ధ్యాన్‌చంద్ జయంతిని పురస్కరించుకుని అనంతపురంలోని అశోక్ నగర్ ఇండోర్ స్టేడియంలో మంగళవారం జాతీయ క్రీడాదినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కలెక్టర్ హాజరయ్యారు. మేజర్ ధ్యాన్‌చంద్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. క్రీడాకారులు అన్నింటా దృఢంగా ఉంటారన్నారు. చిరుప్రాయం నుంచే క్రీడల్లో పాల్గొనేలా పిల్లలను ప్రోత్సహించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఆసక్తి ఉన్న క్రీడల్లో ప్రతి విద్యార్థి పాల్గొనేలా చొరవ చూపించాలన్నారు. అంతర్జాతీయ స్థాయి క్రీడల్లో పాల్గొనే వారికి అన్ని విధాలుగా ప్రోత్సాహం అందిస్తామన్నారు. అనంతరం క్రీడాకారులను ఆమె పరిచయం చేసుకుని, కాసేపు సరదాగా బాస్కెట్‌బాల్ ఆడారు. అనంతరం క్రీడల్లో గెలుపొందిన వారికి బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ వరప్రసాద్, ట్రెనీ కలెక్టర్ కుషాల్ జైన్, జిల్లా చీఫ్ కోచ్ నరసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పనుల్లో నాణ్యత లోపించరాదు



సూచనలిస్తున్న స్టేట్ క్వాలిటీ కంట్రోల్ చీఫ్ బుగ్గయ్య

కూడేరు: మనబడి నాడు–నేడు కింద చేపట్టిన పనుల్లో ఎక్కడే గాని నాణ్యత లోపించరాదని ఇంజినీరింగ్ అధికారులను మనబడి నాడు–నేడు స్టేట్ క్వాలిటీ కంట్రోల్ చీఫ్ బుగ్గయ్య ఆదేశించారు. మంగళవారం కూడేరు మండలం రామచంద్రాపురంలోని ప్రాథమిక పాఠశాల, కమ్మూరు, కొర్రకోడులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో చేపట్టిన నాడు–నేడు పనులను ఆయన పరిశీలించారు. ప్రభుత్వ బడులను బలోపేతం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతనిస్తున్న క్రమంలో పనుల్లో నాణ్యత లోపించరాదని సూచించారు. చేపట్టిన పనులు వేగవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో పీఆర్ ఏఈ శ్రీనివాసులు, ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.


మహిమ గల చెంబు వ్యవహారంలో ఇద్దరి అరెస్ట్

తలుపుల: మహిమ గల చెంబు (రైస్ పుల్లింగ్) వ్యవహారంలో ఇద్దరిని పోలీసులు అరెస్ట్ చేశారు. వివరాలను ఎస్‌ఐ మగ్బూల్‌బాషా వెల్లడించారు. అనంతపురానికి చెందిన రాఘవేంద్ర, అతని డ్రైవర్ లింగమయ్య ఇద్దరూ తమ వద్ద రూ.కోట్ల విలువ చేసే మహిమ గల చెంబు ఉందని, తక్కువ ధరకే దానిని విక్రయిస్తున్నట్లు కొందరిని నమ్మించే యత్నం చేశారు. ఈ విషయం తెలుసుకున్న ఎస్‌ఐ మగ్బూల్‌బాషా అప్రమత్తమై రెక్కమాను క్రాస్‌లో ఇద్దరినీ అదుపులోకి తీసుకుని విచారించారు. వారి నుంచి జాకెట్, హెల్మెట్, రాగి చెంబు, కారు స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

అనుబంధాలకు ప్రతీక 'రాఖీ'

ఏటా శ్రావణ పౌర్ణమి వచ్చిందంటే సోదరసోదరీమణుల మధ్య ఆనందోత్సాహాలు నెలకొంటాయి. అన్నాచెల్లెళ్లు.. అక్కాతమ్ముళ్ల బంధానికి ప్రతీకగా నిలిచిన రాఖీ పండుగ రానేవచ్చింది. ఇప్పటికే జిల్లా వ్యాప్తంగా గ్రామాల్లో, పట్టణాల్లో సందడి నెలకొంది. మార్కెట్లలో వివిధ రకాల రాఖీల విక్రయాలూ ఊపందుకున్నాయి. కులమతాలకు అతీతంగా రాఖీ పౌర్ణమిని నిర్వహించుకోవడంతో పాటు ద్విజులు తమ యజ్ఞోపవీతాలను శాస్త్రోక్తంగా మార్చుకునే ఉపకర్మలు, హయగ్రీవ జయంతిని బుధవారం వేడుకగా నిర్వహించుకునేందుకు జిల్లా వాసులు సిద్ధమయ్యారు. జైలులో శిక్ష అనుభవిస్తున్న ఖైదీలకు మంగళవారం బ్రహ్మకుమారీలు రాఖీలు కట్టి శుభాకాంక్షలు తెలిపారు. – సాక్షి ఫొటోగ్రాఫర్, అనంతపురం/కల్చరల్:





రాఖీలు కొనుగోలు చేస్తున్న విద్యార్థినులు,ఆకట్టుకున్న రాఖీలు



అనంతపురంలోని రహదారులపై విక్రయానికి ఉంచిన వివిధ రకాల రాఖీలు

పంచాయతీ నిబంధనలు పక్కాగా అమలు కావాలి : జేసీ

అనంతపురం రూరల్: పంచాయతీల పరిధిలో కొత్త లే అవుట్ల ఏర్పాట్లకు సంబంధించి ప్రభుత్వ నిబంధనలు పక్కాగా అమలు చేయాలని కార్యదర్శులకు జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్ సూచించారు. కొత్త లే అవుట్ల ఏర్పాట్లలో ఉన్న నిబంధనలు, జగనన్న భూ హక్కు–భూ రక్ష, పంచాయతీలో చేపట్టబోయే పలు అభివృద్ధి పనులకు సంబంధించి కార్యదర్శులకు నెల రోజుల పాటు జరిగే శిక్షణా తరగతులు మంగళవారం టీటీడీసీలో ప్రారంభమయ్యాయి. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జాయింట్ కలెక్టర్‌తో పాటు జిల్లా పంచాయతీ అధికారి ప్రభాకర్‌రావు హాజరయ్యారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ... గ్రామ పంచాయతీల పరిధిలో కొత్త లే అవుట్ల ఏర్పాటు అమలులో ఉన్న నిబంధనలు వివరించారు. జగనన్న శాశ్వత భూ హక్కు–భూ రక్ష కార్యక్రమంలో గ్రామ కంఠాల పరిధిలో ఉన్న ఇళ్ల యజమానులకు హక్కు పత్రాల జారీ విషయంగా తీసుకోవాల్సిన జాగ్రత్తపై చైతన్య పరిచారు. సుస్థిర అభివృద్ధి లక్ష్యాల సాధన, ఉపాధిహామీ పథకం అమలు తదితర అంశాలపై పూర్తి అవగాహన పెంచుకోవాలన్నారు.

వైభవంగా సంజప్పతాత రథోత్సవం



రథాన్ని లాగుతున్న భక్తులు

ఉరవకొండ: మండలంలోని మోపిడి గ్రామంలో వెలసిన సంజప్ప తాత రథోత్సవం మంగళవారం వేడుకగా సాగింది. ఉదయం మూలవిరాట్‌కు విశేష అభిషేకాలు, పూజలు చేసి, మడుగు తేరు లాగారు. ఆలయంలో ప్రత్యేక హోమాలు నిర్వహించిన అనంతరం విశేష పుష్పాలతో అలంకరించిన రథంపై స్వామి ఉత్సవ మూర్తిని అధిష్ఠింపజేసి సంజప్ప తాత నామస్మరణతో భక్తులు లాగారు.

నేటి నుంచి పాలిసెట్ రెండో దశ కౌన్సెలింగ్

అనంతపురం: పాలిసెట్ రెండో దశ కౌన్సెలింగ్ ప్రక్రియ బుధవారం ప్రారంభం కానుందని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ జయచంద్రారెడ్డి తెలిపారు. సెప్టెంబర్ ఒకటిలోపు ఫీజు చెల్లింపు, సర్టిఫికెట్ల పరిశీలన పూర్తి చేసుకోవాలని విద్యార్థులకు సూచించారు. సెప్టెంబర్ 4న సీట్ల కేటాయింపు ఉంటుందని, 7వ తేదీ లోపు ఆయా కళాశాలల్లో రిపోర్టు చేయాలన్నారు.

చిరుత సంచారం

కూడేరు: మండలంలోని కరుట్లపల్లి, తిమ్మాపురం అటవీ ప్రాంతాల్లో గత రెండు రోజులుగా సంచరిస్తున్న చిరుత ఇటీవల ఓ కుక్కపై దాడి చేసింది. విషయాన్ని గమనించిన రైతులు పొలాల్లోకి వెళ్లేందుకు భయపడుతున్నారు. జనవాసాలకు సమీపంలోకి వచ్చిన చిరుతలు.. గ్రామంలోకి ప్రవేశిస్తే తమ పరిస్థితి ఏమిటంటూ ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

క్లుప్తంగా

రూ.2వేల కోట్ల మార్కు చేరుకోవాలి


మాట్లాడుతున్న డీసీసీబీ చైర్‌పర్సన్ ఎం.లిఖిత

అనంతపురం అగ్రికల్చర్: జిల్లా కేంద్ర సహకార బ్యాంకు (డీసీసీబీ) టర్నోవర్ రూ.1,680 కోట్లకు చేరుకోవడం ఆనందంగా ఉందని చైర్ పర్సన్ ఎం.లిఖిత అన్నారు. ఈ ఆర్థిక సంవత్సరం ముగిసేలోపు రూ.2 వేల కోట్ల మార్క్‌ను చేరుకునేలా ప్రతి ఒక్కరూ మరింత బాధ్యతగా పనిచేయాలని ఆదేశించారు. మంగళవారం స్థానిక డీసీసీబీ హాలులో బ్రాంచి మేనేజర్లతో సమీక్ష నిర్వహించారు. సమీక్షలో సీఈవో ఏబీ రామ్‌ప్రసాద్, జీఎం కె.సురేఖారాణి, డీజీఎం రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

అనుబంధాలకు ప్రతీక రక్షాబంధన్


పోలీసు సిబ్బందికి, ఖైదీలకు రాఖీలు కడుతున్న బ్రహ్మకుమారీలు

అనంతపురం కల్చరల్: విశ్వ శ్రేయస్సు, సౌభ్రాతృత్వాన్ని ఘనంగా చాటుతూ ఈశ్వరీయ విశ్వవిద్యాలయ బ్రహ్మకుమారీలు పలుచోట్ల రక్షాబంధనాలు కట్టి రాఖీ పర్వదిన విశిష్టతను తెలియజేశారు. బ్రహ్మకుమారీల జిల్లా ఇన్చార్జ్ సిస్టర్ శారద నేతృత్వంలో జిల్లా జైలు, ఓపెన్ ఎయిర్‌లో ఖైదీలకు రాఖీలు కట్టి, స్వీట్లు పంపిణీ చేశారు. సిస్టర్ శారద మాట్లాడుతూ అన్నాచెల్లెళ్ల బంధం ప్రతి మనిషిలో పరివర్తన తెస్తుందని, ఈ సందర్భంగా వారితో అన్నారు. పీటీసీలో పోలీసు సిబ్బందికి, ఆర్టీటీ కార్యాలయంలో సిబ్బందికి, నిర్వాహకులకు రక్షాబంధనలు అందించి రాఖీ విశిష్టతను తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బుధవారం జిల్లా అధికారులందరికీ రాఖీలు కట్టనున్నట్లు తెలిపారు.

ఉద్యోగులకు క్రీడలూ అవసరమే

అనంతపురం సిటీ: నిత్యం పనిఒత్తిడితో ఉండే ఉద్యోగులకు క్రీడల ద్వారా మానికోల్లాసంతో పాటు ఆరోగ్యంగా ఉంటారని తపాలా ఉద్యోగులు ప్రమోద్, ధనుంజయ, శ్రీధర్, రాఘవేంద్రగౌడ్ తెలిపారు. ఆటలతోనే అందరికీ ఆరోగ్యం సాధ్యమని తెలియజేస్తూ తపాలా ఉద్యోగులు అనంతపురంలో మంగళవారం ర్యాలీ చేశారు. ధ్యాన్‌చంద్ జయంతిని పురస్కరించుకొని నేషనల్ స్పోర్ట్స్ డే కార్యక్రమంలో భాగంగా తపాలా డివిజనల్ కార్యాలయం నుంచి ఆర్ట్స్ కళాశాల వరకు ఆ శాఖ ఉద్యోగులు బ్యానర్‌ను ప్రదర్శిస్తూ ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆర్ట్స్ కళాశాల మైదానంలో పోటీలు నిర్వహించారు.

రీవెరిఫికేషన్ పక్కాగా చేయాలి

రాప్తాడు: రీవెరిఫికేషన్ పకడ్బందీగా చేయాలని నగరపాలక సంస్థ కమిషనర్, ఎన్నికల ప్రత్యేకాధికారి భాగ్యలక్ష్మి ఆదేశించారు. మంగళవారం ప్రసన్నాయపల్లి, చిన్మయనగర్, ఇందిరమ్మ కాలనీ, కళాకారుల కాలనీలో తొలగించిన పాటో సిమిలర్ ఎంట్రీ ఓటర్ల ఇంటికి వెళ్లి ఓటర్లను పునఃపరిశీలించారు. తహసీల్దార్ లక్ష్మీనరసింహ, ఈడీటీ విజయ్ కుమార్, బీఎల్ఓలు పాల్గొన్నారు.

అనంతపురం క్రైం: అనంతపురం అసెంబ్లీ నియోజకవర్గంలో తొలగించిన ఓట్లను మంగళవారం రీ వెరిఫికేషన్ చేశారు. అదనపు కమిషనర్ రమణా రెడ్డి, మెప్మా పీడీ విజయలక్ష్మి పరిశీలించారు.

ధరలు అరికట్టడంలో కేంద్రం విఫలం

అనంతపురం అర్బన్: నిత్యావసర సరుకుల ధరలను అరికట్టడంలో కేంద్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని సీపీఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్ విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా సీపీఎం కేంద్ర కమిటీ పిలుపు మేరకు చేపట్టిన సమరభేరిని పాతూరు వద్ద రాంభూపాల్ జెండా ఊపి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ సమస్యల పరిష్కారం కోసం ఈనెల 30 నుంచి సెప్టెంబరు 4 వరకు వాడవాడల తిరిగి కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న విధానాలను ప్రజలకు తెలియజేస్తూ సెప్టెంబరు 5న నగరపాలక సంస్థ వద్ద పెద్ద ఎత్తున ధర్నా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సీపీఎం నగర కార్యదర్శి రామిరెడ్డి, నాయకులు ప్రకాష్, మసూద్, గఫూర్, వెంకటనారాయణ, ముస్కిన్, తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు అండగా ఉంటాం


మాట్లాడుతున్న తోపుదుర్తి నయనతారెడ్డి

ఆత్మకూరు: నియోజకవర్గ ప్రజలకు అండగా ఉంటామని ఎస్కే యూనివర్సిటీ మెంబర్, వైఎస్సార్‌సీపీ నాయకురాలు తోపుదుర్తి నయనతారెడ్డి తెలిపారు. మంగళవారం పంపనూరు సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో ఉచితంగా రోటరీ క్లబ్ సౌజన్యంతో ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి ఆధ్వర్యంలో బెంగళూర్ వారి శంకర ఉచిత కంటి వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. 105 మంది కంటి పరీక్షలు చేయగా, 54 మందిని శస్త్ర చికిత్సల కోసం బెంగళూరుకు తీసుకెళ్లారు. అనంతరం ఆమె సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి పూజలు నిర్వహించారు. ఆలయ ఈఓ ఆక్కిరెడ్డి, ఆలయ కమిటీ చైర్మన్ చంద్రశేఖర్‌రెడ్డి, ఎంపీపీ హేమలత, సాంఘిక సంక్షేమశాఖ రాష్ట్ర డైరెక్టర్ చిన్నక్క తదితరులు పాల్గొన్నారు.


గిడుగు రామమూర్తి చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న రామకృష్ణా రెడ్డి


కేంద్ర గ్రంథాలయంలో సంస్థ చైర్‌పర్సన్ ఎల్ఎం ఉమ అధ్వర్యంలో..


తెలుగు భాషా దినోత్సవ కార్యక్రమంలో ఉపాధ్యాయినులు

తెలుగు భాషా వైతాళికుడు గిడుగు

అనంతపురం: తెలుగు వాడుక భాషా ఉద్యమ పితామహుడు, తెలుగు సాహిత్య వైతాళికుడు గిడుగు రామ్మూర్తి అని ఎస్కేయూ వీసీ మాచిరెడ్డి రామకృష్ణా రెడ్డి అన్నారు. తెలుగు భాషా దినోత్సవం సందర్భంగా గిడుగు రామ్మూర్తి చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళి అర్పించారు. సాహితీ వ్యాసంగంలోనూ, నూతన విద్యా రంగంలోనూ తమ జీవితాన్ని అంకితం చేసిన ధన్యజీవి గిడుగు అన్నారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఎంవీ లక్ష్మయ్య పాల్గొన్నారు.

తెలుగు భాషాభివృద్ధికి కృషి చేయాలి..

గిడుగు రామ్మూర్తి స్ఫూర్తితో తెలుగు భాషాభివృద్ధికి తెలుగు పరిశోధకులు కృషి చేయాలని సెంట్రల్ యూనివర్సిటీ ఆఫ్ ఏపీ డీన్ ప్రొఫెసర్ జి.రాంరెడ్డి పేర్కొన్నారు. తెలుగు విభాగం ఆధ్వర్యంలో తెలుగు భాషా దినోత్సవ వేడుకలు మంగళవారం నిర్వహించారు. కార్యక్రమంలో బత్తల అశోక్‌కుమార్, హనుమాన్ కెన్నడీ, సంయుక్తాచార్యులు డాక్టర్ బాబు గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

గిడుగును స్ఫూర్తిగా తీసుకోవాలి..

గిడుగు రామ్మూర్తిని ప్రతి ఒక్కరూ స్ఫూర్తిగా తీసుకోవాలని జేఎన్‌టీయూ అనంతపురం వీసీ జింకా రంగ జనార్దన పేర్కొన్నారు. జేఎన్‌టీయూ అనంతపురంలో వ్యవహారిక తెలుగు భాషా ఉద్యమ పితామహుడు గిడుగు రామ్మూర్తి జయంతి వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో రెక్టార్ ప్రొఫెసర్ ఎం. విజయకుమార్, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ సి. శశిధర్, డైరెక్టర్లు ప్రొఫెసర్ వి. సుమలత, ప్రొఫెసర్ పి. సుజాత, ప్రొఫెసర్ సి. శోభాబిందు, ప్రొఫెసర్ ఏ. సురేష్ బాబు పాల్గొన్నారు.

= కేంద్ర గ్రంథాలయంలో గిడుగు వెంకట రామ్మూర్తి జయంతి వేడుకలు సంస్థ చైర్‌పర్సన్ ఎల్ఎం. ఉమామోహన్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. సంస్థ మాజీ అధ్యక్షుడు ఎల్ఎం మోహన్ రెడ్డి, ఉప గ్రంథాలయాధికారి సుబ్బరత్నమ్మ, కావేరి, రామాంజినమ్మ, శ్రీ విజయ, సరస్వతమ్మ, గంగాధర్ పాల్గొన్నారు.

అనంతపురం శ్రీకంఠం సర్కిల్: జిల్లా పోలీస్ హెడ్ క్వార్టర్స్‌లో తెలుగుభాషా దినోత్సవం సందర్భంగా గిడుగు రామ్మూర్తి జయంతి వేడుకలు మంగళవారం నిర్వహించారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ గ్రాంథికభాషలో ఉన్న తెలుగు వచనాన్ని ప్రజల వాడుక భాషలోకి తీసుకొచ్చిన మహనీయుడు గిడుగు రామ్మూర్తి అన్నారు. అదనపు ఎస్పీ ఆర్ విజయభాస్కర్ రెడ్డి, సీఐ విశ్వనాథచౌదరి, ఆర్ఐలు హరికృష్ణ, రాముడు, జిల్లా పోలీసు అధికారుల సంఘం అడహక్ కమిటీ సభ్యులు సాకే త్రిలోకనాథ్, సుధాకర్ రెడ్డి, తేజ్ పాల్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.


జేఎన్‌టీయూ అనంతపురంలో తెలుగుభాషా దినోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

ఆకట్టుకున్న తెలుగు పద్యగానం

అనంతపురం కల్చరల్: తెలుగు భాషా దినోత్సవం సందర్భంగా వేమన ఫౌండేషన్ ఆధ్వర్యంలో మంగళవారం రాత్రి సాగిన పద్య నాటకం ఆకట్టుకుంది. ఫౌండేషన్ సహాయ కార్యదర్శి యర్రగుంట్ల కృష్ణారెడ్డి అధ్యక్షతన కార్యక్రమం జరిగింది. ఎస్కేయూ రిజిస్ట్రార్ ఎంవీ లక్ష్మయ్య, డాక్టర్ జాగర్లపూడి శ్యామ సుందర శాస్త్రి, గౌడుచెర్వు యమునరాణి, డాక్టర్ అప్పిరెడ్డి హరినాథరెడ్డి తదితరులు హాజరై మాట్లాడారు. కవులు నబీరసూల్, రియాజుద్దీన్, కృష్ణవేణి, మధురశ్రీ, రాహుల్, రమణ, గాయకులు సుధాకర్, జానకి, జలీల్ పాల్గొన్నారు.

అనంతపురం కల్చరల్: యువజనాభ్యుదయం, పర్యాటక శాఖ, భాషా సాంస్కృతిక శాఖ, రాష్ట్ర పురావస్తు శాఖ ఆధ్వర్యంలో గిడుగు రామమూర్తి జయంతి వేడుకలు మంగళవారం ఘనంగా జరిగాయి. భాషా ప్రేమికులైన ఉద్యోగులను పురావస్తుశాఖ ఏడీ రజిత సత్కరించారు. కార్యక్రమంలో మహేంద్ర, శ్రీరాములు, గంగా నరేష్‌బాబు పాల్గొన్నారు.

రాప్తాడు: హంపాపురం సమీపంలో ఎస్వీఐటీ ఇంజినీరింగ్ కళాశాలలో జాతీయ క్రీడా దినోత్సవం, తెలుగు భాషా దినోత్సవం నిర్వహించారు. ఎస్వీఐటీ కళాశాల కరస్పాండెంట్ బీవీఆర్ శర్మ, కళాశాల సీఈఓ ఆనంద్‌కుమార్, ప్రిన్సిపాల్ టి.సూర్యశేఖర్ రెడ్డి, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ శ్రీనివాసులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

రాప్తాడురూరల్: కోర్టురోడ్డులోని శ్రీ చైతన్య పాఠశాలలో మంగళవారం తెలుగు భాషా దినోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో ఏజీఎం సుబ్బారెడ్డి, ప్రిన్సిపాల్ తబస్సుమ్, వైస్ ప్రిన్సిపాల్ బాలకృష్ణ, కోఆర్డినేటర్ శ్రీనివాసరావు, డీన్లు అప్పలనాయుడు, సిరాజుద్దీన్, మహేష్, ఏఓ గోపాల్, ప్రైమరీ ప్రీ ప్రైమరీ ఇన్‌చార్జ్‌లు నీరజ, భారతి, తేజస్విని పాల్గొన్నారు.

ఆత్మకూరు: విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలని కేజీబీవీ ప్రిన్సిపాల్ లీమారోజ్ తెలిపారు. మంగళవారం స్థానిక కేజీబీవీ పాఠశాలలో తెలుగు భాషా దినోత్సవంతో పాటు, జాతీయ క్రీడా దినోత్సవాన్ని జరుపుకున్నారు.

అనంతపురం రూరల్: స్థానిక సెయింట్ ఆన్స్ ఇంగ్లిష్ మీడియం స్కూల్‌లో తెలుగు భాషా దినోత్సవాన్ని మంగళవారం నిర్వహించారు. రచయితల సంఘం జిల్లా గౌరవాధ్యక్షుడు నబీరసూల్, ప్రిన్సిపాల్ సిస్టర్ అనీలా, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

రాప్తాడురూరల్: నగరంలోని వివిధ స్కూళ్లలో గిడుగు రామ్మూర్తి జయంతి వేడుకలు జరుపుకున్నారు. ఎస్వీ డిగ్రీ కళాశాలలో వైస్ చైర్మన్ సి.చక్రధర్‌రెడ్డి , ప్రిన్సిపాల్ వై.మధుసూదన్‌రెడ్డి, తెలుగు అధ్యాపకులు ఈ మురళీధర్ పాల్గొన్నారు.

- సంగమేష్‌నగర్, గుత్తిరోడ్డులోని మాంటిస్సోరి విద్యా సంస్థల్లో తెలుగుభాష దినోత్సవం జరిపారు. కరస్పాండెంట్ సి.సూర్యనారాయణరెడ్డి, కార్యదర్శి కె.మాధవి, ప్రిన్సిపాళ్లు కె.పద్మావతి, ఎ.రమాదేవి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.
- రామచంద్రానగర్‌లోని సెయింట్ ఆన్స్ స్కూల్‌లో తెలుగుభాష దినోత్సవం, క్రీడా దినోత్సవం జరుపుకున్నారు. హెచ్ఎం అనీల పాల్గొన్నారు.

క్రీడాకారులను ప్రోత్సహిద్దాం

రాప్తాడు: క్రీడాకారులను ప్రోత్సహిస్తే జాతీయ,అంతర్జాతీయ స్థాయిలో రాణిస్తారని ఇన్‌చార్జ్ హెచ్ఎం సాంబశివ పేర్కొన్నారు. మంగళవారం మండల కేంద్రంలో స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హాకీ మాంత్రికుడు మేజర్ ధ్యాన్ చంద్ జయంతి, తెలుగు బాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో పీడీ కేశవమూర్తి, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ధ్యాన్ చంద్ జీవితం ఆదర్శం

అనంతపురం టవర్‌క్లాక్: ధ్యాన్‌చంద్ జీవితం ఆదర్శమని వక్తలు అన్నారు. ధ్యాన్ చంద్ జయంతి సందర్భంగా మంగళవారం ఇండోర్ స్టేడియంలో జిల్లాస్థాయి కబడ్డీ పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో బీజేపీ యువ మోర్చ జిల్లా అధ్యక్షుడు అశోక్‌రెడ్డి, డీఎస్ఏఓ అధికారి నరసింహారెడ్డి, కబడ్డీ చీఫ్ కోచ్ అనిల్‌కుమార్, సంధ్య, ప్రసాద్, నరసింహులు, లోకేష్, రవికుమార్, నాగ శేఖర్ తదితరులు పాల్గొన్నారు.


గిడుగు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న జిల్లా ఎస్పీ శ్రీనివాసరావు


మాట్లాడుతున్న సెంట్రల్ యూనివర్సిటీ ఆఫ్ ఏపీ డీన్ ప్రొఫెసర్ జి.రాంరెడ్డి


మాట్లాడుతున్న ఎస్వీ డిగ్రీ కళాశాల వైస్ చైర్మన్ చక్రధర్‌రెడ్డి


గిడుగు రామ్మూర్తి పంతులు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న రచయితలు, కవులు


భాషాప్రేమికుడిని సన్మానిస్తున్న పురావస్తుశాఖ ఏడీ రజిత


సాంస్కృతిక కార్యక్రమంలో మాంటిస్సోరి విద్యార్థినులు


వేడుకల్లో పాల్గొన్న చైతన్య పాఠశాల సిబ్బంది

దుష్ప్రచారాన్ని సమర్థంగా తిప్పికొట్టాలి

• ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి

అనంతపురం క్రైం: టీడీపీ, బీజేపీ, జనసేన, ప్రతిపక్షాలు ఓ వర్గం మీడియాను అడ్డంపెట్టుకుని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంపై చేస్తున్న దుష్ప్రచారాన్ని తిప్పికొట్టాలని ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం నగరంలోని యాపిల్ గార్డెన్స్‌లో జేసీఎస్ సైన్యం యాప్‌పై సచివాలయ కన్వీనర్లు, గృహసారథులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముందుగా యాప్ పని తీరును తెలియజేశారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో జరిగిన అభివృద్ధి, సంక్షేమ పథకాలతో పాటు పరిపాలనలో సంస్కరణలపై ప్రజాప్రతినిధులు, వైఎస్సార్ సీపీ శ్రేణులకు పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రం అప్పుల్లో ఉందని, దివాళ తీస్తోందని ఎల్లో మీడియా కథనాలు రాస్తున్నాయని మండిపడ్డారు. రాష్ట్ర విభజన తర్వాత లోటు బడ్జెట్‌తో పాలన ప్రారంభమైందని, ఐదేళ్ల టీడీపీ హయాంలో ఎలాంటి అభివృద్ధి, సంక్షేమం జరగలేదన్నారు. చంద్రబాబు హయాంలో 5 వేల స్కూళ్లు మూతపడ్డాయని, విద్యా, వైద్య రంగాలను టీడీపీ నిర్వీర్యం చేసిందన్నారు.

చేసిన మేలు ప్రజలకు తెలియజెప్పాలి

వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సీఎంగా బాధ్యతలు తీసుకున్న తర్వాత రెండేళ్ల పాటు కోవిడ్ పరిస్థితులను ఎదుర్కొన్నా..ఆర్థిక పరిస్థితి సహకరించకున్నా ఎక్కడా సంక్షేమ పథకాలు ఆపలేదని ఎమ్మెల్యే అన్నారు. విద్య, వైద్యానికి ప్రజలకు చేరువయ్యేలా నూతన సంస్కరణలు తీసుకొచ్చారన్నారు. సచివాలయ వ్యవస్థ ద్వారా ఒకే నోటిఫికేషన్‌లో 1.50 లక్షల మందికి ఉద్యోగాలు కల్పించారన్నారు. సామాజిక సేవా దృక్పథంతో ఉన్న 2.50 లక్షల (రెండు లక్షలా యాభై వేలు) మంది వలంటీర్లను నియమించి పరిపాలనను ప్రజల చెంతకు చేర్చారన్నారు. మేయర్ వసీం మాట్లాడుతూ గత టీడీపీ ప్రభుత్వంలో కలహాలతో అభివృద్ధిని మరిచారని, తమ ప్రభుత్వంలో నగరం నలుదిక్కులా అభివృద్ధి జరుగుతోందన్నారు. అనంతపురం నియోజకవర్గంలో పంగల్ రోడ్డు నుంచి బైపాస్ వరకు, గుత్తి రోడ్డులో జాతీయ రహదారుల విస్తరణ చేపట్టామని, నగరంలో రూ.వందల కోట్ల అభివృద్ధి చేపట్టామన్నారు. కార్యక్రమంలో అహుడా చైర్మన్ మహాలక్ష్మి శ్రీనివాస్, డిప్యూటీ మేయర్లు కోగటం విజయభాస్కర్ రెడ్డి, వాసంతి సాహిత్య, వక్ఫ్‌బోర్డు జిల్లా చైర్మన్ కాగజ్‌ఘర్ రిజ్వాన్, మార్కెట్‌యార్డు చైర్మన్ ఫయాజ్, పార్టీ బీసీ సెల్ జోనల్ ఇన్‌చార్జ్ రమేష్‌గౌడ్, పార్టీ నగరాధ్యక్షుడు సోమశేఖర్ రెడ్డి, అనుబంధ సంఘాల అధ్యక్షులు ఉమ్మడి మదన్‌మోహన్ రెడ్డి, శ్రీదేవి, ఎగ్గుల శ్రీనివాసులు, సైఫుల్లాబేగ్, జేసీఎస్ కన్వీనర్లు కొండ్రెడ్డి ప్రకాష్ రెడ్డి, ఆలమూరు శ్రీనివాస్‌రెడ్డి, లక్ష్మణ్ణ, మధు, మైనార్టీ కార్పొరేషన్ డైరెక్టర్ గౌస్‌బేగ్, తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి

ఆర్‌బీకేల్లో 1,800 క్వింటాళ్ల 'ప్రత్యామ్నాయ' విత్తనాలు

అనంతపురం అగ్రికల్చర్: రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు 80 శాతం సబ్సిడీతో రైతులకు పంపిణీ చేయడానికి వీలుగా ప్రత్యామ్నాయ పంటల విత్తనాలు అందుబాటులో ఉంచుతున్నట్లు ఏపీ సీడ్స్ జిల్లా మేనేజర్ జే.ధనలక్ష్మి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పటికే 100 ఆర్‌బీకేల్లో 1,800 క్వింటాళ్లు సిద్ధంగా ఉన్నాయన్నారు. ఉలవలు, అలసందలు, పెసలు, కొర్ర విత్తనాలు అవసరమైన రైతులు ఆర్‌బీకేల్లో సంప్రదించాలన్నారు. ఖరీఫ్ పంటల సాగు విస్తీర్ణం ఆధారంగా ప్రతి ఆర్‌బీకేలోనూ డిమాండ్ మేరకు 5 నుంచి 50 క్వింటాళ్లు వరకు సరఫరా చేశామని తెలిపారు. రాయితీ పోను ఉలవలు కిలో రూ.21.60, అలసందలు రూ.23, పెసలు రూ.23.50, కొర్రలు రూ.13.50 ప్రకారం చెల్లించాల్సి ఉంటుందన్నారు. నాలుగు రకాల ప్రత్యామ్నాయ విత్తనాలు 14 వేల క్వింటాళ్ల వరకు పంపిణీ చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. ఇప్పటికే వ్యవసాయశాఖ ద్వారా పంపిణీ కార్యక్రమం కొనసాగుతోందని వెల్లడించారు. ఈ–క్రాప్ నమోదు ఉన్నందున ప్రత్యామ్నాయ విత్తనాలు తీసుకెళ్లిన రైతులు వర్షం కురిసిన వెంటనే తప్పనిసరిగా పంట సాగు చేసుకోవాలని సూచించారు.

స్టాండింగ్ కమిటీ ఎన్నిక ఏకగ్రీవం


డిక్లరేషన్ పత్రాలను అందిస్తున్న కమిషనర్ భాగ్యలక్ష్మి

అనంతపురం క్రైం: నగరపాలక సంస్థ స్టాండింగ్ కమిటీ ఎన్నికలు ఏకగ్రీవమయ్యాయి. మంగళవారం నామినేషన్ విత్‌డ్రా చేసుకునేందుకు ఎవరూ ముందుకురాకపోవడంతో ఇప్పటికే నామినేషన్ దాఖలు చేసిన కంసల లీలావతి, గురు శేఖర్‌బాబు, తరిమల అబూసలేహ, ఎం.రాజేశ్వరి, సంపంగి రామాంజనేయులను స్టాండింగ్ కమిటీ సభ్యులుగా కమిషనర్ భాగ్యలక్ష్మి ధ్రువీకరించారు. మంగళవారం నగరపాలక సంస్థలో కంసల లీలావతి, గురుశేఖర్ బాబు, సంపంగి రామాంజనేయులకు కమిషనర్ డిక్లరేషన్ పత్రాలు అందజేశారు. మిగితా సభ్యులు బుధవారం పత్రాలను తీసుకోనున్నారు. ఈ కార్యక్రమంలో సభ్యులు, నగరపాలక సంస్థ కార్యదర్శి సంగం శ్రీనివాసులు పాల్గొన్నారు.

కో–ఆప్షన్ సభ్యుడి రాజీనామా

అనంతపురం సిటీ: కంబదూరు మండల కో–ఆప్షన్ సభ్యుడు షేక్ మహబూబ్ సాబ్ తన పదవికి రాజీనామా చేశారు. ఈ మేరకు ఆయన అనంతపురంలోని జిల్లా పరిషత్ కార్యాలయంలో ఇన్‌చార్జ్ సీఈఓ/జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్‌ను మంగళవారం మధ్యాహ్నం కలిసి రాజీనామా పత్రాన్ని అందజేశారు. వ్యక్తిగత కారణాలతో తాను రాజీనామా చేస్తున్నట్లు అందులో పేర్కొన్నారు. ఆయన వెంట కంబదూరు జెడ్పీటీసీ సభ్యుడు నాగరాజు ఉన్నారు.

మెరుగైన వైద్య సేవలందించాలి

అనంతపుర ం క్రైం: రోగులకు మెరుగైన వైద్య సేవలందించాలని జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ కేఎస్ఎస్ వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. మంగళవారం సర్వజనాస్పత్రిలోని క్యాజువాలిటీ, చిన్నపిల్లల విభాగం ఓపీ, తదితర వార్డులను ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. రోగులకు సకాలంలో వార్డులకు తరలించాలన్నారు. ఆర్ఎంఓ డాక్టర్ పద్మజ, సీనియర్ సివిల్ అసిస్టెంట్ సర్జన్ డాక్టర్ శివకుమార్, తదితరులు పాల్గొన్నారు.

అంకితభావంతో పనిచేయాలి

అనంతపురం క్రైం: ప్రతి ఒక్కరూ అంకితభావంతో పని చేసి, పేదలకు మెరుగైన వైద్యసేవలు అందించాలని ల్యాబ్ టెక్నీషియన్లకు డీఎంహెచ్ఓ డాక్టర్ భ్రమరాంబదేవి సూచించారు. మంగళవారం డీఎంహెచ్ఓ కార్యాలయంలో నూతన డీఎంహెచ్‌ను ల్యాబ్ టెక్నీషియన్ అసోసియేషన్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. కార్యక్రమంలో ల్యాబ్ టెక్నీషియన్ అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీధర్‌బాబు, కోశాధికారి శ్రీనివాసులు, కార్యనిర్వహణ కార్యదర్శి సుదర్శన్, శ్రీనివాస్ రెడ్డి, కార్యవర్గ సభ్యులు మస్తాన్, శివకుమార్, ప్రసన్న కుమార్ పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: ఈ నెల 26న ఆత్మహత్యాయత్నం చేసిన ఓ యువకుడు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. అనంతపురం మూడో పట్టణ సీఐ ధరణీకిషోర్ తెలిపిన మేరకు... ఈ నెల 26న స్థానిక రైల్వే స్టేషన్‌లో పురుగుల మందు తాగి అపస్మారక స్థితిలో ఉన్న ఇంద్రజిత్‌నాయక్ (39) మంగళవారం మృతి చెందినట్లు త్రీటౌన్ సీఐ ధరణీకిషోర్ తెలిపారు. మహారాష్ట్రకు చెందిన ఇంద్రజిత్ నాయక్ (39) రాయదుర్గానికి ఓ యువతిని పెళ్లి చేసుకుని ఇక్కడే స్థిరపడ్డారు. వీరికి ఓ కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఈ నెల 26న భార్య మందలించిందని క్రిమిసంహారక ద్రావకం తాగాడు. సర్వజనాస్పత్రిలో చికిత్సపొందుతూ మంగళవారం మృతి చెందాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

మద్యం తాగి వాహనాలు నడపొద్దు

రాప్తాడురూరల్: మద్యం తాగి వాహనాలు నడిపితే చర్యలు తప్పవని అనంతపురం రూరల్ సీఐ రామకృష్ణారెడ్డి వాహనదారులను హెచ్చరించారు. మంగళవారం కళ్యాణదుర్గం రోడ్డు నరిగమ్మ ఆలయ సమీపంలో రూరల్ పోలీసులు వాహనాలను తనిఖీలు చేశారు. వాహనాలను ఆపి డ్రైవింగ్ లైసెన్స్‌తో పాటు ఇతర రికార్డులు పరిశీలించారు. వాహనదారులకు రికార్డులు ఉండాలన్నారు. సీఐ వెంట ఎస్ఐలు వెంకటరమణ, ప్రవీణ్, సిబ్బంది ఉన్నారు.

కలెక్టర్‌ను కలిసిన ఆహార సలహా సంఘం సభ్యుడు


కలెక్టర్‌కు మొక్క అందిస్తున్న, లక్ష్మణ్‌కుమార్

అనంతపురం అర్బన్: జిల్లా కలెక్టర్ గౌతమిని జిల్లా ఆహార సలహా సంఘం సభ్యుడు గుజ్జల లక్ష్మణ్ కుమార్ మంగళవారం కలెక్టరేట్‌లోని ఆమె చాంబర్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వానికి మంచి పేరు వచ్చేలా పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్సీ,ఎస్టీ మానిటరింగ్ కమిటీ సభ్యుడు పోలా వీరా, నల్లబోతుల గోపాల్, కార్తిక్, తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

అత్మకూరుకు చేరిన ఎస్ఎఫ్ఐ సైకిల్‌ర్యాలీ

ఆత్మకూరు: జిల్లాలో విద్యారంగ సమస్యల పరిష్కారానికి ఈనెల 23 నుంచి ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో చేపట్టిన సైకిల్‌యాత్ర మంగళవారం ఆత్మకూరుకు చేరుకుంది. ఎస్ఎఫ్ఐ నాయకులకు సీపీఎం మండల కార్యదర్శి శివశంకర్, సీపీఎం నేతలు ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి పరమేష్, ఐద్వా జిల్లా ఉపాధ్యక్షురాలు రామాంజినమ్మ, సీఐటీయూ నాయకురాలు రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

అనంతపురం టౌన్: నగరంలో బుధవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటలకు వరకు శ్రీనగర్‌కాలనీ, మంగళవారి కాలనీ, సవేరా ఆస్పత్రి తదితర ప్రాంతాల్లో విద్యుత్ అంతరాయం ఉంటుందని విద్యుత్ శాఖ డీ3 ఏఈ రామాంజనేయులు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. 33కేవీ లైన్ మరమ్మతు చేస్తుండడంతో 4గంటల పాటు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు.

మార్మోగిన హనుమాన్ చాలీసా పఠనం

అనంతపురం కల్చరల్: విశ్వశాంతి లక్ష్యంగా శ్రావణ మంగళవారం సాయిట్రస్టు ఆధ్వర్యంలో నిర్వహించిన సామూహిక హనుమాన్ చాలీసా పఠనంతో కోర్టురోడ్డు వీధులు మార్మోగాయి. వరదాంజనేయస్వామి ఆలయంలో ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు కర్నూలుకు చెందిన శ్రీ గోదా విష్ణు సహస్రనామ మండలి వారు 18 వేలసార్లు హనుమాన్ చాలీసా పఠనం చేశారు. డిప్యూటీ మేయర్ వాసంతి సాహిత్య, టీటీడీ పాలక మండలి బోర్డు మెంబరు అశ్వర్థనాయక్, మిస్సెస్ ఇండియా సుజనా, బీజేపీ జిల్లా అధ్యక్షుడు సందిరెడ్డి శ్రీనివాసులు పాల్గొన్నారు.

వైభంగా పెద్దమ్మతల్లి విగ్రహ ప్రతిష్ఠ

ఆత్మకూరు: మండల కేంద్రంలో పొలిమేర పెద్దమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠ మంగళవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉదయం నుంచి యంత్ర ప్రతిష్ఠ, విగ్రహ ప్రతిష్ఠ, హోమం , ప్రాణప్రతిష్ఠ, బంబకళాన్యాసం, విగ్రహ అలంకారం, పూర్ణాహుతి, కక్షజ్వాల మహా మంగళహారతి తదితర పూజలు నిర్వహించారు. భక్తులకు తీర్థప్రసాదాలతోపాటు అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. పూజల్లో వైఎస్సార్‌సీపీ నాయకురాలు తోపుదుర్తి నయనతారెడ్డి పాల్గొన్నారు.

యువకుడి ఆత్మహత్య

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: నగరంలోని రామచంద్రానగర్‌లోని ఓ ప్రైవేట్ ట్రావెల్స్ టికెట్ బుకింగ్ సెంటర్‌లో పనిచేసే జీవన్ (27) ఫ్యానుకు ఉరివేసుకుని మంగళవారం మధ్యాహ్నం ఆత్మహత్య చేసుకున్నాడు. వివరాలు.. మైసూరు మండి మహల్లా ప్రాంతానికి చెందిన జీవన్ ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మైసూరు నుంచి మృతుడి తండ్రి గోపినాథ్ అనంతపురం రాగానే కేసు నమోదు చేస్తామని త్రీటౌన్ సీఐ ధరణీకిశోర్ తెలిపారు.

బకాయి ఫీజులు చెల్లించాలి

అనంతపురం: జగనన్న విద్యాదీవెన, వసతి దీవెన పథకాల కింద విద్యార్థుల తల్లుల ఖాతాలో నగదు జమ అయిన వారు ఫీజులు వర్సిటీకి చెల్లించాలని ఎస్కేయూ వీసీ ప్రొఫెసర్ మాచిరెడ్డి రామకృష్ణా రెడ్డి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. హాస్టల్, కాలేజీ బకాయిలు ఉన్న వారికి పరీక్షలకు అనుమతించలేదన్నారు. విద్యాదీవెన, వసతి దీవెన కింద నగదు జమ అయిన వారు వెంటనే చెల్లించాలన్నారు. బకాయిలు చెల్లించిన వారందరికీ తిరిగి పరీక్షలు నిర్వహిస్తామన్నారు.